క్లుప్తంగా

నిత్యావసర సరుకులు పంపిణీ



పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న హన్యానాయక్

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణంలోని దుబ్బతండా వద్ద గల విశ్వాస పరిచర్య ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో బుధవారం పాస్టర్ ధీరావత్ హన్యానాయక్ నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ ధీరావత్ రమాబాయి, వెంకన్న, రాజయ్య, సాంబయ్య, శ్రీలత ఉన్నారు.

ఓటర్లకు ధన్యవాదాలు

మిర్యాలగూడ టౌన్ : నల్లగొండ పార్లమెంటు ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించిన ఓటర్లకు తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పన్నాల గోపాల్ రెడ్డి, గుండెబోయిన నాగేశ్వర్‌రావు యాదవ్ ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా వేర్వేరుగా బుధవారం మిర్యాలగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాదిగ సంఘాల మహాకూటమి నాయకులు పోలేపల్లి ఉదయ్‌కుమార్, పోకల రవి, ఊర రామకృష్ణ కూడా కృతజ్ఞతలు తెలిపారు.

ఓటర్లకు కృతజ్ఞతలు

కొండమల్లేపల్లి : కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి గెలుపునకు కృషి చేసిన పార్టీ శ్రేణులు, అధిక మెజార్టీ అందించిన నియోజకవర్గ ఓటర్లకు ఆ పార్టీ నల్లగొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ ఎంఏ.సిరాజ్‌ఖాన్ బుధవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన సమ్మర్ క్యాంపు



శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న రవికిరణ్

మిర్యాలగూడ టౌన్ : డిస్ట్రిక్ స్పోర్ట్స్ అథారిటీ, మిర్యాలగూడ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్ఎస్‌పీ క్యాంపులోని ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న బ్యాడ్మింటన్ సమ్మర్ క్యాంపు బుధవారం ముగిసింది. సమ్మర్ ముగింపులో భాగంగా పట్టణంలోని రెడ్డికాలనీలో గల లాస్య కంప్యూటర్ నిర్వాహకుడు రవికిరణ్ శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు జ్ఞాపికలు బహూకరించారు. అదే విధంగా స్పోర్ట్స్ అథారిటీ వారు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ ప్రశాంత్, మిర్యాలగూడ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ అంజయ్య, జిల్లా కోచ్ రామకృష్ణ తదితరులున్నారు.

ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

దేవరకొండ: కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థికి దేవరకొండ నియోజకవర్గం నుంచి దాదాపు 60వేల పైచిలుకు ఓట్ల మెజార్టీ అందించిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. దేవరకొండ సమగ్రాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

బీజేపీకి పెరిగిన ఓటింగ్ శాతం

దేవరకొండ: గత ఎన్నికలతో పోలిస్తే ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో దేవరకొండ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో భారతీయ జనతా పార్టీకి ఓటింగ్ శాతం పెరిగింది. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ బీజేపీ ఎంపీ అభ్యర్థి గార్లపాటి జితేందర్‌కి దేవరకొండ నియోజకవర్గంలో దాదాపు 10వేల ఓట్లు పోలవ్వగా ప్రస్తుతం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డికి 30వేల పైచిలుకు ఓట్లు పోలయ్యాయి. దేవరకొండ సెగ్మెంట్ పరిధిలో బీజేపీ అభ్యర్థి గెలుపును కాంక్షిస్తూ నేతలు ప్రచారాలు, సమావేశాలు నిర్వహించారు.

సురేష్‌గుప్తాకు పురస్కారం

రామగిరి(నల్లగొండ): పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఏటా రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఇచ్చే గ్రీన్ చాంపియన్ పురస్కారం ఈ సంవత్సరం నల్లగొండకు చెందిన పర్యావరణ వేత్త సురేష్ గుప్తాను వరించింది. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సురేష్ గుప్తా గ్రీన్ చాంపియన్ షిప్ -2024 పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఎన్జీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ తండు కృష్ణకౌండిన్య మాట్లాడుతూ సురేష్ గుప్తా గ్రీన్ చాంపియన్ పురస్కారం అందుకోవడం నల్లగొండకు గర్వకారణమని అన్నారు. సృజన సాహితీ అధ్యక్షుడు పెరుమాళ్ల ఆనంద్ మాట్లాడుతూ సురేష్ గుప్తా ప్రతిఒక్కరికీ ఆదర్శప్రాయుడని అన్నారు. సురేష్ గుప్తాను అభినందించిన వారిలో సృజన సాహితీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సాగర్ల సత్తయ్య ఉన్నారు.

వ్యవసాయ పనులు ముమ్మరం

పెద్దవూర: నాలుగైదు రోజులుగా వాతావరణం చల్లబడి వర్షాలు కురుస్తుండడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. పెద్దవూర మండలంలో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి రైతులు పత్తి విత్తనాలు విత్తే పనిలో ఉన్నారు. నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి రెండు మూడు రోజుల్లో ప్రవేశిస్తాయని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించటంతో రైతులు ఈ సారి వానాకాలం సాగుపై కోటి ఆశలు పెట్టుకున్నారు. బోరు బావులు ఉన్న రైతులు డ్రిప్‌లు ఏర్పాటు చేసి పత్తి విత్తనాలు వేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే రైతులు విత్తనాలను కొనుగోలు చేసుకుని విత్తటానికి సిద్ధంగా ఉన్నారు.



పెద్దవూర మండలం బట్టుగూడెంలో పత్తి విత్తనాలు విత్తుతున్న కూలీలు



పెంటను ట్రాక్టర్‌లోకి ఎత్తుతున్న కూలీలు



డ్రిప్ పైపులను సిద్ధం చేస్తున్న కూలీలు



అరకలను సిద్ధం చేసుకుంటున్న రైతులు



చేను దున్నుతున్న రైతు

పీడీఎస్ బియ్యం పక్కదారి

- సేకరించిన బియ్యం గుట్టుగా రవాణా
- జిల్లా సరహద్దులు దాటిస్తూ సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు



ఇటీవల పౌర సరఫరాల శాఖ అధికారులకు పట్టుబడిన పీడీఎస్ బియ్యం

చందంపేట : పేదలకు దక్కాల్సిన పీడీఎస్ బియ్యం పక్కదారి పడుతోంది. కొందరు వ్యాపారులు చందంపేట, నేరేడుగొమ్ము మండలాల్లో సేకరించిన పీడీఎస్ బియ్యాన్ని డిండి, కల్వకుర్తిలోని రైస్ మిల్లులకు చేరవేస్తూ లక్షలు ఆర్జిస్తున్నారు. అక్రమార్కులు మారుమూల ప్రాంతాలను ఎంచుకుని రాత్రి సమయాల్లో యథేచ్ఛగా దందా సాగిస్తున్నారు. ముఖ్యంగా చందంపేట మండలంలోని బొల్లారం గ్రామపంచాయతీ మీదుగా మన్నెవారిపల్లి, సిద్ధాపురం గ్రామాల మీదుగా అచ్చంపేట, కల్వకుర్తి తదితర ప్రాంతాలకు బియ్యం రవాణా చేస్తున్నారని తెలిసింది.

కేసులు నమోదవుతున్నా..

పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై ఓ వైపు పౌర సరఫరాల శాఖ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహిస్తూ కేసులు నమోదు చేస్తున్నా అక్రమ దందా మాత్రం ఆగడం లేదు. ప్రజలు సైతం తమకు ప్రభుత్వం సరఫరా చేసిన పీడీఎస్ బియ్యాన్ని తక్కువ ధరకు దళారులకు అమ్ముకుంటుండడంతో అధికారులు కార్డుదారులపై ఎలాంటి చర్యలు తీసుకోలేకపోతున్నారు. దీంతో దళారులు ప్రజల నుంచి సేకరించిన పీడీఎస్ బియ్యాన్ని గుట్టుగా వాహనాల్లో జిల్లా సరిహద్దులు దాటిస్తూ లక్షలు పోగేసుకుంటున్నారు.

నిఘా ఏర్పాటు చేశాం



పీడీఎస్ బియ్యాన్ని అనుమతులు లేకుండా తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే పీడీఎస్ బియ్యం తరలిస్తున్న పలువురిని గుర్తించి కేసులు నమోదు చేశాం. రాత్రి సమయాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నాం. పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలించినా, అమ్ముకున్నా చట్టరీత్యా చర్యలు తప్పవు. పదే.. పదే పట్టుబడితే వారిపై పీడీయాక్ట్ కేసులు సైతం నమోదు చేస్తాం.

– శ్రీనివాస్‌గౌడ్, డీటీసీఎస్, దేవరకొండ

ప్లకార్డులతో నిరసన

మిర్యాలగూడ టౌన్ : నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు విక్రయించిన మిర్యాలగూడలోని శ్రీచైతన్య స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని ఆ పాఠశాల ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు సరికొండ రుషికేశ్వర్ రాజు, చిలుముల కొండల్, దేవులపల్లి కార్తీక్ రాజు, ఉప్పతల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై అడ్డగోలుగా వాహనాల నిలుపుదల

- కొండమల్లేపల్లిలో జఠిలమవుతున్న ట్రాఫిక్ సమస్య



కొండమల్లేపల్లిలో రోడ్డుపై నిలిపిన బైక్‌లు

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి పట్టణ కేంద్రంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ జఠిలమవుతోంది. పట్టణ కేంద్రంలోని దేవరకొండ రోడ్డులో గల యూనియన్ బ్యాంక్ భవనం ఎదుట అడ్డగోలుగా ద్విచక్రవాహనాలు నిలుపుతుండడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దేవరకొండ వైపు వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.స్థానిక పోలీస్, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

కార్యాలయానికి బోర్డు ఏర్పాటు చేయరూ..



బోర్డు లేని కొండమల్లేపల్లి ఎంపీడీఓ కార్యాలయ భవనం

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల అభివృద్ధి అధికారి కార్యాలయానికి కనీసం బోర్డు కూడా లేదు. 2016వ సంవత్సరంలో మండల కేంద్రంగా ఏర్పాటైన కొండమల్లేపల్లి ఎంపీడీఓ కార్యాలయం ఏడాది పాటు మార్కెట్ యార్డులోని భవనంలో కొనసాగింది. ప్రస్తుతం దోనియాల గ్రామ శివారులో ఏర్పాటు చేసిన ఎస్సెల్బీసీ భవనంలో కొనసాగుతుంది. ఈ భవనంలో ఉన్న ఎస్సెల్బీసీ కార్యాలయాన్ని మాల్ పట్టణానికి మార్చగా అప్పటి నుంచి ఈ భవనంలోనే కొనసాగుతుంది. మండల వాసులు ఈ భవనానికి వస్తే కనీసం బోర్డు లేకపోవడంతో తికమక పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోర్డు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

కట్టంగూర్ : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కట్టంగూర్ ఎస్ఐ శ్రీను సూచించారు. బుధవారం మండల కేంద్రంలో ప్రజలకు సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరిచయం లేని వ్యక్తుల నుంచి వచ్చిన కాల్స్‌కు ఎలాంటి సమాచారం ఇవ్వొద్దన్నారు. ఎస్ఎంఎస్ రూపంలో వచ్చిన లింక్‌లను ఓపెన్ చేసి మోసపోవద్దన్నారు.

'సాగర్'లో కాంగ్రెస్‌కే పట్టం

- లోక్‌సభ ఎన్నికల్లో రఘువీర్‌రెడ్డికి 76,488 ఓట్ల మెజారిటీ
- రెండో స్థానంలో బీఆర్ఎస్
- పార్లమెంట్ ఎన్నికల్లోనూ హస్తం పార్టీదే ఆధిక్యం
- పార్లమెంట్ ఎన్నికల్లో పుంజుకున్న బీజేపీ



సాగర్‌లో ఎంపీ రఘువీర్‌రెడ్డిని సన్మానిస్తున్న అనుముల మండల కాంగ్రెస్ నాయకులు

హాలియా : నాగార్జున సాగర్ నియోజకవర్గంలో 2021లో జరిగిన ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అనూహ్య విజయాన్ని సాధించిన విషయం తెలిసిందే. ఉప ఎన్నికల్లో 18వేల మెజార్టీతో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం సాధించారు. కానీ సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో మాత్రం కాంగ్రెస్ విజయభేరీ మోగించింది. 2021లో సాగర్‌లో జరిగిన ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నోముల భగత్‌పై 18వేలకుపైగా ఓట్ల తేడాతో ఓటమి చవిచూసిన మాజీ మంత్రి జానారెడ్డి ఆ తరువాత 2023 అసెంబ్లీ ఎన్నికల బరిలో నుంచి తప్పుకున్న ఆయన సార్వత్రిక ఎన్నికల్లో ఆయన తనయుడు కుందూరు జయవీర్‌రెడ్డిని బరిలో నిలిపి బీఆర్ఎస్ అభ్యర్థి నోముల భగత్‌ను 55,849 ఓట్ల మెజార్టీతో ఓడించి విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఈ ఎన్నికల్లో మరో అరుదైన విషయమూ చోటు చేసుకుంది. 2018, 2021 ఎన్నికల్లో నోముల నర్సింహయ్య, నోముల భగత్ చేతిలో రెండు సార్లు ఘోర పరాజయం చెందిన కుందూరు జానారెడ్డి ఐదేళ్ల తరువాత ఆయన తనయుడు కుందూరు జయవీర్ రెడ్డిని అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిపి బీఆర్ఎస్ అభ్యర్థి నోముల భగత్‌ను మూడింతల ఓట్ల మెజార్టీతో ఓడించారు. తాజాగా జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి 76,488 ఓట్ల మెజార్టీ రావడం నాగార్జున సాగర్ నియోజకవర్గ చరిత్రలో ఇదే ప్రథమం.

బీఆర్ఎస్ శ్రేణుల్లో నైరాశ్యం

గతేడాది నవంబర్‌లో జరిగిన శాసనసభ ఎన్నికలకు తాజాగా జరిగిన పార్లమెంట్ ఎన్నికలకు సాగర్ నియోజకవర్గ ప్రజలు పూర్తిగా భిన్నమైన తీర్పునిచ్చారు. 2023 శాసనసభ ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్‌కు 63,982 ఓట్లు వచ్చాయి. ఇక పార్లమెంట్ ఎన్నికలకు వచ్చే సరికి ఆ పార్టీకి 30,604 ఓట్లు రావడం పట్ల పార్టీ శ్రేణుల్లో తీవ్ర నైరాశ్యం మిగిల్చింది.

భారీగా ఓట్లు బదిలీ..

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 63,982 ఓట్లు రాగా పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థికి 30,604 ఓట్లు పోలయ్యాయి. దీంతో 33వేలపై చిలుకు ఓట్లు కాంగ్రెస్, బీజేపీకి బదిలీ అయ్యాయి. బీజేపీకి అసెంబ్లీ ఎన్నికల్లో 6491 ఓట్లు రాగా పార్లమెంట్ ఎన్నికల్లో 24,988 ఓట్లు అధికంగా పోలయ్యాయి. బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో కొంత ప్రజలను ఆదరించినా పార్లమెంట్ ఎన్నికల్లో ఆదరణ పొందలేకపోయింది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఎక్కడా బీఆర్ఎస్ పోటీ ఇవ్వలేక పోయింది. 2018, 2021 ఎన్నికల వరకు గులాబీ దళానికి కంచుకోటగా ఉన్న సాగర్ నియోజకవర్గం 2023 అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు బీఆర్ఎస్‌కు షాకిచ్చి కాంగ్రెస్‌కు పట్టం కట్టారు.

అసెంబ్లీ ఎన్నికల కంటే బీజేపీకి అధిక ఓట్లు

అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి వచ్చిన ఓట్ల కంటే లోక్‌సభ ఎన్నికల్లో అధికంగా వచ్చాయి. సాగర్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పార్టీ నుంచి పోటీ చేసిన కంకణాల నివేదితారెడ్డికి 6491 ఓట్లు రాగా పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి 24,988 ఓట్లు సాధించారు. బీజేపీకి గతం కంటే 18497 ఓట్లు అధికంగా వచ్చాయి.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మిర్యాలగూడ కోర్టు ఆవరణలో మొక్క నాటుతున్న న్యాయమూర్తులు



ఎన్ఎస్‌పీ క్యాంపు కార్యాలయ సమీపంలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ టౌన్ : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని 5వ అదనపు జిల్లా న్యాయమూర్తి వేణు, సీనియర్ సివిల్ జడ్జి సుజయ్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి స్వర్ణలత, రెండవ అడిషనల్ జడ్జి ఎన్.అపూర్వ రవళి అన్నారు. బుధవారం స్థానిక కోర్టు ఆవరణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. పచ్చని చెట్లు ప్రగతి మెట్లు లాంటివి అని అన్నారు. మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో మిర్యాలగూడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రం రామకృష్ణారెడ్డిలతో పాటు జూనియర్, సీనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

నాగార్జునసాగర్: పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని నందికొండ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ అన్నపూర్ణ కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విరివిగా మొక్కలు నాటడంతో పాటు వాటిని కాపాడాలని కోరారు. నీడ, కలప, పండ్లనిచ్చే మొక్కలతో పాటు పూలమొక్కలను పెంచాలని కోరారు. కార్యక్రమంలో కమీషనర్ శ్రీనివాస్,కౌన్సిలర్లు మంగ్తానాయక్,మున్సిపాలిటీ సిబ్బంది నిరంజన్ పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

మిర్యాలగూడ టౌన్ : మొక్కలు నాటి వాటిని సంరక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎన్ఎస్‌పీ క్యాంపు కార్యాలయ సమీపంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాల్లో మొక్కలు నాటడం వలన పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించవచ్చన్నారు. కార్యక్రమంలో కెఎల్ఎన్ జూనియర్ కళాశాల డైరెక్టర్లు తుమ్మలపల్లి హన్మంతరెడ్డి, తుమ్మలపల్లి నరేందర్‌రెడ్డి, బిక్కుమళ్ల కిరణ్‌కుమార్, చైతన్య, ఆనంద్‌కుమార్, న్యాయవాది బంటు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



నాగార్జునసాగర్ : మొక్క నాటుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్, కౌన్సిలర్లు

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



మల్లికార్జున స్వామి ఆలయంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

- సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి

హాలియా : ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత సాధ్యమని సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి అన్నారు. అనుముల మండలం హజారిగూడెం గ్రామంలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయం ప్రథమ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆధ్మాతికతను అలవర్చుకోవాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ అనుముల మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కాకునూరి నారాయణ గౌడ్, నాయకులు యడవెల్లి నరేందర్ రెడ్డి,కుంటిగొర్ల శ్రీనివాస్ యాదవ్, కుందూరు రాజేందర్‌రెడ్డి, దేవాలయ చైర్మన్ మన్యం కృష్ణమూర్తి, ధర్మకర్త జానపాటి రామయ్య, తక్కెళ్లపల్లి ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

వేసవి శిబిరాల ఏర్పాటు అభినందనీయం

రామగిరి(నల్లగొండ): విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎంఈఓ కత్తుల అరుంధతి అన్నారు. బుధవారం నల్లగొండ పట్టణంలోని బోయవాడ హైస్కూల్లో జిల్లా బాల కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొని నృత్య శిక్షణ, టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సుల్లో ప్రావీణ్యం పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.కార్యక్రమంలో జిల్లా మహిళా ప్రాంగణం మేనేజర్ అనిత, ట్రైనర్లు ప్రణతి, ఉపేంద్రచారి, వెంకటేశ్వర్లు, ఫజల్ బేగం, జిల్లా బాల కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంఈఓ అరుంధతి

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



మిర్యాలగూడ : ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సూచించారు. ఇటీవల వెలువడిన నీట్ ఫలితాల్లో పట్టణంలోని కేఎల్ఎన్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు బి.మేఘన -632, బి.అద్వైత్‌కృష్ణ-631, ఎన్.సమీర్-491, బి.అఖిల-428, పి.సంజన -397 ర్యాంకులు సాధించి ప్రతిభ చాటారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను బుధవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో భవిష్యత్తు ముడిపడి ఉందని అన్నారు. అదేవిధంగా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంలో కృషి చేసిన కళాశాల కరస్పాండెంట్ కిరణ్‌కుమార్, డైరెక్టర్లు నరేందర్‌రెడ్డి, పీఎల్ఎన్.రెడ్డి, హనుమంతరెడ్డిలను అభినందించారు.

విద్యార్థుల ప్రతిభ

హాలియా : నీట్ ఫలితాల్లో హాలియా పట్టణానికి చెందిన టైం స్కూల్, కృష్ణవేణి స్కూల్స్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. టైం స్కూల్‌కు చెందిన విద్యార్థిని నెమలి గీతాంజలికి 720 మార్కులకు గాను 535 మార్కులు, విద్యార్థి ఆంగోతు శ్రీకాంత్ 513 మార్కులు సాధించారు. అదే విధంగా స్థానిక కృష్ణవేణి స్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థిని యామిని 610 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయా పాఠశాలల యాజమాన్యం నిమ్మల లక్ష్మారెడ్డి, నులక రవీందర్‌రెడ్డి, మంద నర్సిరెడ్డి, మంద నరేందర్ రెడ్డి, పాఠశాల ప్రిన్స్‌పాల్ కత్తి కోటిరెడ్డి, అధ్యాపక బృందం అభినందించింది.

నీట్‌లో మెరిసిన గిరిజన విద్యార్థిని



సిరివెన్నెల సాయి

మిర్యాలగూడ: నీట్ ఫలితాల్లో మిర్యాలగూడ పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు భూక్యా శ్రీనివాస్‌రావు, బుజ్జి దంపతుల కుమార్తె సిరివెన్నెల సాయి జాతీయ స్థాయి గిరిజన కేటగిరీలో 18వ ర్యాంకు, జనరల్ కేటగిరిలో 4,125వ ర్యాంకు సాధించింది. సిరివెన్నెల 1 నుంచి 7వ తరగతి వరకు మిర్యాలగూడలో, 8–10 తరగతి వరకు కేకేఆర్ గౌతమ్ పాఠశాలలో, ఇంటర్మీడియట్ విజయవాడలోని నారాయణ కళాశాలలో చదివింది. ఈ సందర్భంగా సిరివెన్నెల సాయి మాట్లాడుతూ వైద్యం రంగంలో రాణించి పేద ప్రజలకు సేవ చేస్తానని పేర్కొంది. ఉత్తమ ర్యాంకు సాధించిన సిరివెన్నెలను బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ దశరథ్‌నాయక్ అభినందించారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలని వినతి

నార్కట్‌పల్లి : ఉపాధి హామీ పథకంలో పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య బుధవారం మండల కేంద్రంలో ఏపీఓ యాదయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ బకాయిలపై ఈ నెల 8న నల్లగొండలోని డీఆర్‌డీఏ కార్యాలయం ఎదుట చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చెరుకు పెద్దులు, మండల కార్యదర్శి దండు నాగరాజు, చింతపల్లి బయ్యన్న, దండు శ్రీను పాల్గొన్నారు.

కొండమల్లేపల్లిలో భారీ వర్షం



కొండమల్లేపల్లి పట్టణంలో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. పట్టణ కేంద్రం గుండా వెళ్లే 67వ నంబరు జాతీయ రహదారిపై ఇలా వర్షపు నీరు నిలిచింది. దీంతో వాహనాల రాకపోకలకు కొంత ఇబ్బంది కలిగింది.

– కొండమల్లేపల్లి